క్లుప్తంగా

జలజాక్షికి సంగీత కళా సాగర బిరుదు ప్రదానం



జలజాక్షిని సంగీత కళా సాగర బిరుదుతో సత్కరిస్తున్న వీఎంఏ ప్రతినిధులు

మద్దిలపాలెం : నగరానికి చెందిన కర్ణాటక గాత్ర విద్వన్మణి ముట్నూరి జలజాక్షిని సంగీత కళా సాగర బిరుదుతో విశాఖ మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులు సత్కరించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సోమవారం జరిగిన జలజాక్షి సంగీత కచేరీ అలరించింది. అనంతరం ఆమెకు బిరుదు ప్రదానం చేసి, సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఏ ప్రతినిధులు రంగరాజన్, రాజారావు, పేరాల బాల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో పేరుకుపోతున్న వ్యర్థాలు



కూరగాయల వ్యర్థాలతో నిండిన డస్ట్‌బిన్

ఏయూ క్యాంపస్: రైతుబజార్‌లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. జీవీఎంసీ సిబ్బంది కాలానుగుణంగా చెత్తను తొలగించకపోవడంతో కుళ్లిపోయి కంపు కొడుతున్నాయి. పెదవాల్తేరు రైతుబజార్‌లో నిత్యం ఆకుకూరల వ్యర్థాలను వెనుక భాగంలో ఉన్న డస్ట్‌బిన్‌లో వేస్తున్నారు. దీనిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. డస్ట్‌బిన్ నిండిపోయి పక్కనే గుట్టగా తయారవుతోంది. దీంతో దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని వినియోగదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో ఢీకొనడంతో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. వన్ టౌన్‌లోని కొబ్బరితోటకు చెందిన బి.కుమార్‌స్వామి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 25న అతడు పని నిమిత్తం వెళ్లాడు. తిరిగి 26న ఉదయం 5 గంటలకు జ్ఞానాపురం బ్రిడ్జి మీద నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా.. పైడితల్లి అమ్మవారి గుడి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో అతడి ఎడమకాలికి గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు కుమార్‌స్వామిని చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించారు. సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ బి.సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'స్పందన'కు 10 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ఏసీపీ ఆరా

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం రెండో రోజు ఈస్ట్ ఏసీపీ డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి సందర్శించారు. పాత కేసులతోపాటు ఇతర కేసులపై ఆరా తీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని ఎస్‌ఐలు వెంకటరావు, ప్రమీలకు ఏసీపీ సూచించారు. రౌడీషీటర్లకు సంబంధించి వారి యాక్టివిటీస్, మిస్సింగ్ కేసుల గురించి సీఐ ఎస్.విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సీడీ ఫైల్స్‌పై ప్రత్యేక ఆరా తీసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఏసీపీ మూర్తి మాట్లాడుతూ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు.

ఆహ్లాదకరం.. అంగన్‌వాడీ కేంద్రాలు



విశాఖ తూర్పు నియోజకవర్గంలో 24 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో టీచర్లతో పాటు ఆయాలు మొత్తం 48 మంది విధులు నిర్వర్తిస్తుండగా ముగ్గురు సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఆయా సెంటర్లలో 2,572 మంది గర్భిణిలు, బాలింతలు సేవలు పొందుతున్నారు. 550 మంది వరకు చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యతో పాటు పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తోంది. మరో వైపు అంగన్‌వాడీ భవనాలను పూర్తి సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా తూర్పులో కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.26 లక్షల నిధులు విడుదల చేసింది.

కార్పొరేట్ లుక్‌తో సౌకర్యాలు

ప్రభుత్వం మంజూరు చేసిన రూ.26 లక్షలతో అవసరమైన సెంటర్లలో ఉన్నత స్థాయి మౌలిక సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా మదర్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో ఆయా సెంటర్ల పరిధిలోని ముగ్గురు చిన్నారుల తల్లులు, సమీపంలోని స్కూల్ హెచ్‌ఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సచివాలయం ఇంజినీరింగ్ కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్ సభ్యులుగా ఉంటారు. వారి పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు. ఆయా సెంటర్లకు కొత్త లుక్ తెచ్చేలా పెయింటింగ్స్, టాయిలెట్స్ ఆధునికీకరణ, తాగునీటి సౌకర్యం, ఎలక్ట్రిసిటీ, తదితర సదుపాయాలు కల్పించనున్నారు.

> నాడు–నేడు పనుల్లో భాగంగా పలు కేంద్రాల ఆధునికీకరణ

> 24 సెంటర్ల అభివృద్ధికి రూ.26 లక్షల మంజూరు

> ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

విద్యకు తొలి నుంచి అత్యధిక ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు.. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్య వరకు విప్లవాత్మక మార్పులు తెచ్చింది. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను ఉచితంగా అందించడమే కాకుండా పాఠశాలల, కళాశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతోంది. ఇందులో భాగంగానే విద్యార్థి భవిష్యత్‌కు కీలకంగా నిలిచే అంగన్‌వాడీ విద్యను సైతం బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు అంగన్‌వాడీ కేంద్రాలను నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ లుక్‌తో తీర్చిదిద్దిన రాష్ట్ర ప్రభుత్వం.. మరిన్ని కేంద్రాల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది.

– ఎంవీపీ కాలనీ



ఎంవీపీ కాలనీ ఫిషర్‌మెన్ కాలనీలో ఆధునికీకరించిన అంగన్‌వాడీ కేంద్రం

తూర్పు నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	24
లబ్ధి పొందుతున్న బాలింతలు, గర్భిణులు	2572
విద్యనభ్యసిస్తున్న చిన్నారులు	550



చాచా నెహ్రూ జయంతి వేడుకలు ఉత్సాహంగా నిర్వహిస్తున్న చిన్నారులు(ఫైల్)



ఆరిలోవ సుందరయ్యనగర్‌లో ఆధునికీకరించిన అంగన్‌వాడీ కేంద్రం



ఆహ్లాదకరంగా కాంపౌండ్ వాల్‌పై బొమ్మలు



స్మార్ట్ క్లాస్ రూమ్‌లో పాఠాలు వింటున్న చిన్నారులు

సౌకర్యాలు బాగున్నాయి..



ఎంవీపీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సౌకర్యాలు అన్ని బాగున్నాయి. అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ఇటీవల ఆధునికీకరించారు. ప్రభుత్వం పౌష్టికాహార సరకులను సకాలంలో అందజేస్తోంది. లబ్ధిదారులకు ఫోన్లు చేసి సరకులు తీసుకోవాలని సూచిస్తున్నారు. పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వడంతో పాటు ఆరోగ్యపరంగా సూచనలు, అవగాహన కల్పిస్తున్నారు.

– దాట్ల లలితశ్రీ, లబ్ధిదారు

ఆధునికీకరణతో కొత్త లుక్



పూర్తిస్థాయి ఆధునికీకరణ పనులు చేపట్టడంతో సెంటర్‌కు కొత్త లుక్ వచ్చింది. సెంటర్‌ను నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్నారు. తాగునీటితో పాటు టాయిలెట్స్ సౌకర్యాలు మెరుగుపడ్డాయి. పిల్లలు ఆహ్లాదకర వాతావరణంలో విద్యను అభ్యసించడంతో పాటు ఇండోర్ క్రీడలు ఆడుతున్నారు. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– కోరాడ మణి, లబ్ధిదారు

పౌష్టికాహారం.. మెరుగైన విద్యే లక్ష్యం



ప్రధానంగా ప్రతి విద్యార్థికి అన్ని రకాల వసతులతో కూడి మెరుగైన విద్య అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సేవలు అందిస్తోంది. దీంతో పాటు ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం తప్పనిసరి. చిన్న వయస్సులో ఈ రెండింటిపై శ్రద్ధ వహిస్తే ఆ విద్యార్థికి మంచి భవిష్యత్ ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నాం. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల ఆవరణాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ పూర్తయింది. దీంతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో మిగతా అన్ని కేంద్రాల్లో సౌకర్యాలను అందుబాటులోకి తెస్తాం.

– రమణకుమారి, డీసీపీవో

ఏయూ సమాచారమ్

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక

ఏయూ క్యాంపస్: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్‌లో నిర్వహిస్తున్న జాతీయ సమైక్య శిబిరానికి ఏయూ విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏయూకు పేరుతెచ్చేలా విద్యార్థులు రాణించాలన్నారు. ఈ నెల 29 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు పశ్చిమబెంగాల్‌లోని కల్యాణి యూనివర్సిటీలో జరిగే శిబిరంలో ఏయూకు చెందిన 8 మంది విద్యార్థులు, ప్రోగ్రాం అధికారి హాజరవుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.



శిబిరానికి హాజరవుతున్న విద్యార్థులతో ఇన్‌చార్జి వీసీ ఆచార్య సమత

వైద్యశాల ఆకస్మిక తనిఖీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వైద్యశాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కొంత మంది సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం ఆయన గమనించారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణకు సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం భవనాన్ని తనిఖీ చేశారు. పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పారిశుధ్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు.



హాజరు పట్టికను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్

భగవద్గీత ప్రసంగాల పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో వచ్చేనెల 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే భగవద్గీత ప్రసంగాల పోస్టర్‌ను వీసీ సమత సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వేదాంత ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే భగవద్గీత సిరీస్‌లో భాగంగా జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉపన్యాసకురాలు సుశీలాజీ భగవద్గీత 9వ అధ్యాయంపై ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.సత్యనారాయణ, డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ పాల్గొన్నారు.

7 నుంచి ఏబీవీపీ జాతీయ మహాసభలు

ఏయూ క్యాంపస్: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 7 నుంచి 10వ తేదీ వరకు న్యూఢిల్లీ నగరంలో నిర్వహించే ఏబీవీపీ అఖిల భారత మహాసభల వాల్‌పోస్టర్‌ను ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ న్యాయ కళాశాల ఆచార్యుడు కె.సీతామాణిక్యం, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కె.హర్షరెడ్డి, విభాగ కన్వీనర్ లీలా శంకర్, ఏయూ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఇన్‌చార్జి వీసీకి ఆత్మీయ అభినందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన రెక్టార్ ఆచార్య కె.సమతను సోమవారం ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, మాజీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఆచార్యులు, విభాగాధిపతులు, విద్యార్థులు, ఉద్యోగులు కూడా ఆమెను తన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఓఎస్‌డీ కృష్ణమోహన్, మాజీ వీసీ జి.ఎస్.ఎన్ రాజు

శివోహం..!

- భక్తిశ్రద్ధలతో రెండో సోమవారం పూజలు
- భక్తులతో శివాలయాలు కిటకిట



ఆరిలోవ కాలనీ శివాజీనగర్-2 శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: కార్తీక మాసం రెండో సోమవారం భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. సోమవారంతో పాటు కార్తీక పౌర్ణమి కావడంతో వేకువ నుంచి భక్తులు శివాలయాలకు పోటెత్తారు. ఆరిలోవ శివాజీనగర్–2, ఆపరేషన్ కాలనీ, పెదగదిలి, నెహ్రూనగర్, డ్రైవర్స్ కాలనీ, కైలాసనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, హనుమంతవాక, విశాలాక్షినగర్ శివాలయాలు భక్తులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా కనిపించాయి. ఆలయాల వద్ద ఉదయం 10 గంటల వరకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో నిర్వాహకులు క్యూలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులు శివుడికి పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించి పూజించారు. భక్తులు శివనామస్మరణతో హోరెత్తించారు. శివాజీనగర్–2 శివాలయంలో జ్యోతిర్లింగాలకు నేరుగా భక్తులు అభిషేకాలు చేశారు.

మద్దిలపాలెం : కార్తీక దీపాలతో సోమవారం శివాలయాలు కనువిందుగా దర్శనమిచ్చాయి. పీతలవానిపాలెంలోని రామలింగేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలతో భక్తులు తరించారు. సాయంత్రం స్వామికి అర్చకులు హారతి ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం వేళలో ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.నారాయణరావు, కార్యదర్శి పి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. పాత వెంకోజీపాలెంలోని సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వర ఉత్సవాలలో భాగంగా 1200 దీపాలతో అలంకరణ చేశారు. ఓం, శంకు చక్రం ఆకృతులను జ్యోతులతో అలంకరించారు.



పాత వెంకోజీపాలెంలో కనువిందుగా దీపాలంకరణ



ఎంవీపీ పార్వతీ ముక్తేశ్వరాలయంలో ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఆరిలోవ డ్రైవర్స్‌కాలనీ శివాలయంలో భక్తులు

పార్వతీ ముక్తేశ్వరుడికి నీరాజనం

ఎంవీపీ కాలనీ: స్థానిక సిద్ధివినాయక పార్వతీ ముక్తేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో నీలకంఠుడికి ఉదయం నుంచి దీపారాధన, క్షీరాభిషేకం, ఏకవారాభిషేకాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తుల మహా శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. సాయంత్రం టీటీడీ ధర్మప్రచార పరిషత్ భక్త బృందం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు నిర్వహించారు.

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని అసంగానంద ఆశ్రమంలోని మృత్యుంజయేశ్వర ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. అనంతరం మహిళలు ఆధ్యాత్మిక గీతాలాపన చేశారు.



టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భక్తి ప్రవచనాలు ఆలపిస్తున్న మహిళలు



అసంగానంద ఆశ్రమంలో దీపోత్సవం



అసంగానంద ఆశ్రమంలో ఆధ్యాత్మిక గీతాలాపన

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

కాలుష్య రహిత విశాఖకు సహకరించండి

డాబాగార్డెన్స్: విశాఖలో కాలుష్యం నియంత్రణకు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకట కుమారి ప్రజలకు పిలుపునిచ్చారు. నగర కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం మేయర్ తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రజా రవాణా ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం తన చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో శబ్ద, వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా నగర ప్రజలు తమ వంతు బాధ్యతగా ప్రజా రవాణాన్ని ఉపయోగించాలని, కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ ఇప్పటికే ఎన్నో చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా ప్రతి సోమవారం ఉద్యోగులతోపాటు అధికారులు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు సహకరించాలని ఆమె కోరారు.



ఆరిలోవ క్యాంప్ ఆఫీస్ నుంచి ఆర్టీసీ బస్సులో వస్తున్న మేయర్ హరివెంకటకుమారి